క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పీలేరురూరల్ : స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలో డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కరుణ తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికి గాను మిగిలి ఉన్న 126 సీట్లు భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఐదో తరగతిలో 47, ఆరో తరగతిలో 8, ఏడో తరగతిలో 17, తొమ్మిదో తరగతిలో 8, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో సీఈసీలో 42 సీట్లు ఖాళీలున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఆధార్, కులధృవీకరణ పత్రాలతో పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

సజావుగా నీట్ పరీక్షలు



నీట్ పరీక్ష రాయడానికి వచ్చిన అభ్యర్థులు

కురబలకోట: వైద్య విద్యలో ప్రవేశానికి నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష అంగళ్లులోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో ఆదివారం సజావుగా సాగాయి. పరీక్ష మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాట్లు గావించారు. నిర్వహణ జాగ్రత్తగా కొనసాగిందని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు.

వేడుకగా నారమాను గంగమ్మ విగ్రహ ప్రతిష్ట

మదనపల్లె రూరల్ : మండలంలోని పొన్నేటిపాలెం పంచాయతీ పనసమాకులపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ నారమాను గంగమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శని, ఆదివారాలు రెండు రోజుల పాటు శ్రీ నారమాను గంగమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పనసమాకులపల్లెలో పండుగ వాతావరణం కనిపించింది. ప్రతి ఇంటిని మామిడితోరణాలు, పసుపు,కుంకుమలతో అలంకరించారు. సుమారు రెండేళ్లపాటు గ్రామస్తులందరూ ఐకమత్యంగా, కలిసికట్టుగా శ్రీ నారమాను గంగమ్మ ఆలయ నిర్మాణానికి విశేష కృషి చేశారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం విగ్రహ ప్రాణప్రతిష్ట, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, పంచామృతాభిషేకం, మహామంగళ హారతి నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.

శాంతమ్మకు సీడీపీఓగా పదోన్నతి

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఎస్.శాంతమ్మ సీడీపీఓగా పదోన్నతి పొందారు. వైఎస్సార్ కడప జిల్లా సీకె దిన్నె సీడీపీఓగా నియమిస్తూ ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెకు పదోన్నతిపై తంబళ్లపల్లె, మదనపల్లె ప్రాజెక్టు పరిధిలోని ఉద్యోగులు హర్షం ప్రకటించారు.

కానిస్టేబుళ్లుగా ఇద్దరు ఎంపిక

పెద్దమండ్యం: మండలంలోని రామానాయక్ తండా పంచాయతీ బండకిందతండాకు చెందిన దర్బార్ నాయక్, పెద్దమండ్యం విద్యానగర్ కాలనీకి చెందిన కొమ్మద్ది మహబూబ్‌బాషా కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. వీరిలో మహబూబ్‌బాషా తల్లి గృహిణి కాగా, తండ్రి పాతపుస్తకాల వ్యాపారం చేస్తూ బిడ్డను చదివించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఎటువంటి కోచింగ్ లేకుండా కానిస్టేబుల్‌గా ఎంపికైనట్లు మహబూబ్‌బాషా తెలిపారు. మారుమూల ప్రాంతం నుండి ఇద్దరు యువకులు ఎటువంటి కోచింగ్ లేకుండా కానిస్టేబుళ్లుగా ఎంపిక కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు

రామసముద్రం : మండలంలోని కేసీ.పల్లె పంచాయతీ గుంతయంబాడి గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారి సప్త మాతృకల ఆలయంలో ఆదివారం శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, విశేషపూజలు, ప్రత్యేక పుష్పాలంకారం చేశారు. స్థానికులతో పాటు బెంగుళూరు నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి నేతి, నిమ్మకాయల దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యాశాఖ ఇచ్చిన జీవో వెనక్కి తీసుకోవాలి

పీలేరురూరల్ : పాఠశాల ఆవరణల్లోకి తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు తప్ప ఏ ఇతర అనధికార వ్యక్తులను అనుమతించరాదని కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీవోను వెనక్కు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి భువనేశ్వర్ రెడ్డి, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు లోకనాథం డిమాండ్ చేశారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా హాస్టల్ బాట కార్యక్రమాన్ని చేపట్టి తద్వారా లోపాలు ఉన్నటువంటి అంశాలు వెలుగు చూస్తాయనే భయంతో హాస్టల్స్, పాఠశాలల్లోకి అనుమతి లేదని కూటమి ప్రభుత్వం జీవో తేవడం సరైంది కాదన్నారు. మీరు ఇలాంటి జీవోలు ఎన్ని ఇచ్చినా, వైఎస్సార్‌సీపీ విద్యార్థుల తరపున పోరాడుతుందని తెలిపారు.

ఉపాధిలో అక్రమాలు వెలుగు చూసేనా?



గుర్రంకొండలోని ఉపాధిహామీ కార్యాలయం



ఉపాధిహామీ పథకం కింద నిర్మించిన గోకులం

- బినామీ పేర్లతో గోకులాలు, మస్టర్లు
- ఫిర్యాదు చేసిన గ్రామస్తులు
- మండలంలో మొదలైన సామాజిక తనిఖీ

గుర్రంకొండ: ఉపాధి హామీ పథకంలో అక్రమాలు వెలుగుచూసేనా అంటూ జనం చర్చించుకొంటున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బినామీ పేర్లతో మస్టర్లు వేసి కొంతమంది అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. కొన్ని గ్రామాల్లో గోకులాలు బినామీ పేర్లతో నిర్మించుకొన్నట్లు పలువురు గ్రామస్తులు ఉపాధిహామీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రస్తుతం ఆరు రోజులుగా జరుగుతున్న సామాజిక తనిఖీలో నిష్పక్షపాతంగా నిర్వహిస్తే పలు అక్రమాలు వెలుగు చూడనున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి.

మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో 2024–25 ఏడాదిగాను రూ. 5.34 కోట్లు పనులు జరిగాయి. ఇందులో మెటీరియల్ రూపంలో రూ. కోటి, కూలీలకు బిల్లుల రూపంలో రూ.4.34 కోట్లు చెల్లింపులు చేశారు. ఉపాధిహామీ పథకం కింద మండలానికి 58 గోకులాలు మంజూరయ్యాయి. ఇందులో 55 గోకులాల నిర్మాణాలు పూర్తి చేశారు. కాగా కొన్ని గ్రామాల్లో ఒకరిపేరుతో మంజూరైన గోకులాలు మరొకరిపేరుతో బినామీ వ్యక్తులు నిర్మించుకొన్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా మరికొన్ని చోట్ల గోకులాలు నిర్మించకనే బిల్లులు మంజూరు చేసినట్లు సమాచారం. కాగా ఉపాధిహామీపథకంలో జరిగిన పనుల్లో కొంతమంది పనులు చేయకపోయినా బినామీ వ్యక్తుల పేర్లతో మస్టర్లు వేసి బిల్లులు చేల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో ఉద్యోగస్తులు, బయట ప్రాంతాల్లో పనులుచేసుకొనే వ్యక్తుల పేర్లతో కొంతమంది పనులు చేసుకొన్నట్లు ఫిర్యాదులు వెళ్లాయి. ఉపాధిహామీ పథకం కింద ఫారంపాండ్‌పనులు, ఉద్యానపంటలు, సప్లయ్‌ఛానల్స్, కందకాలు పనులు జరిగాయి. ఈపనులకు సంబంధించిన బిల్లుల మంజూరులోను అవకతవకలు జరిగినట్లు సమాచారం. ఈనేపథ్యంలో ఆరయరోజుల క్రితం సామాజిక తనిఖీ బృందం మండలంలో జరిగిన పనులపై తనిఖీలు నిర్వహించడానికి వచ్చారు. ఈ ఏడాది జరిగిన ఉపాధిహామి పనులకు సంబంధించిన రికార్డులను ఉపాధిహామీ సిబ్బంది నుంచి సామాజిక తనిఖీ బృందం అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. వాటిని మొత్తం పరిశీలించి బృందాలుగా విడిపోయి గ్రామాల్లోకి పనుల తనిఖీ నిమిత్తం వారు వెళ్లిపోయారు.

4తేదీ నుంచి బహిరంగ సభలు

గ్రామాల్లో మకాం వేసి ఆయా గ్రామాల పరిధిలో జరిగిన ఉపాధిహామీ పనులను ఒకొక్కటిగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలిస్తున్నారు. ఈనెల 4తేదీ నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీ బహిరంగ సభలు నిర్వహించనున్నారు. కాగా ఇప్పటికే శెట్టివారిపల్లెలో బినామీ పేర్లతో గోకులాలు నిర్మించుకొని కొంతమంది బిల్లులు చేసుకొన్నారంటూ గ్రామస్తులు సామాజిక తనిఖీ బృందంకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న సామాజిక తనిఖీలో అక్రమాలు వెలుగు చూసేలా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈవిషయమై ఎస్ఆర్‌పీ తిరుమలేష్‌ను వివరణ కోరగా ఉపాధిహామీ పనుల్లో ఎటువంటి అక్రమాలు జరిగినా పూర్తిగా విచారణ జరిపి వాస్తవాలు అందరికి తెలియజేస్తామన్నారు. ఆరోపణలు వచ్చిన గ్రామాల్లో పకడ్బంధీగా ఉపాధిహామీ పనులుగానీ, గోకులాలుగానీ విచారణ చేసి వాస్తవాలు వెల్లడిస్తామన్నారు.

సమాజానికి చెప్పాల్సిన కథ దృశ్యకావ్యం



రచయిత టీఎస్ఏ క్రిష్ణమూర్తిని సన్మానిస్తున్న ప్రముఖులు

మదనపల్లె సిటీ: సమాజానికి చెప్పాల్సింది ఒకటయితే చేయాల్సింది మరొకటని ఆ కోవకు చెందినదే దృశ్యకావ్యం కథ సంపుటిని ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక బీటీ కాలేజీలో సప్తాశ్వాలు గ్రంథంలోని ఏడు కథల్లో దృశ్యకావ్యంపై చర్చా వేదిక నిర్వహించారు. నిజజీవితంలో తాను చేసిన సంఘటనల ఆధారంగానే దృశ్యకావ్యం రాశానన్నారు. సినీమా చిత్రీకరణను హార్సిలీహిల్స్‌లో స్వయంగా చూశానన్నారు. దీని ఆధారంగాను, స్వయంగా తనకు జరిగిన సంఘటనలు ఆధారంగా రాశానన్నారు. తాను రాసిన కథ రాయాలని ఉందా? అనే పుస్తకానికి మంచి ఆదరణ వచ్చిందన్నారు. దీనిపై రచయితలు చర్చ నిర్వహించి తమ అభిప్రాయాలను తెలియజేశారు. కార్యక్రమంలో రచయిత డేరంగుల శ్రీనివాసులు, గొల్లపూడి తిరుపతిరావు, మోమస్‌వల్లి, మునిగోపాలకృష్ణ, ధనలక్ష్మి, నాగారాజు, ఇంజనీర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి



బీసీ హక్కుల పోరాటసమితి కమిటీ సభ్యులకు నియామకపత్రాలు అందజేస్తున్న బి.రాజశేఖర్

మదనపల్లె రూరల్ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయపార్టీలు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ టికెట్లు కేటాయించాలని బీసీ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బోడం రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీ హక్కుల సాధనకు ఎన్నో ఏళ్లుగా తాము పోరాటాలు చేస్తున్నామన్నారు. వాటి ఫలితంగానే బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారందరూ ఏకతాటిపైకి వచ్చి తమ సత్తాను చాటుతున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తా చాటి రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు. బీసీలకు ఎలాంటి సమస్యలు వచ్చినా, ఏ ఇబ్బందులు తలెత్తినా తమ సంస్థ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా బీసీ కమిటీలను నియమించి, నియామకపత్రాలను అందజేశారు. బీసీ హక్కుల పోరాట సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రసహాయ కార్యదర్శిగా ఎం.వెంకటేశ్వర, రాయలసీమ ఉపాధ్యక్షుడిగా ఉప్పు వెంకటేష్, సహాయ కార్యదర్శిగా చామంతుల సిద్ధయ్య, గౌరవాధ్యక్షుడిగా షేక్ కరామత్‌బాషా, సహాయ కార్యదర్శులుగా అమరనాథ్, సి.రామాంజనేయులు, అన్నమయ్యజిల్లా యూత్ ఉపాధ్యక్షులుగా గోవింద శ్రీనివాసులు, పార్లమెంట్ గౌరవాధ్యక్షుడుగా రమణ, సహాయ కార్యదర్శులుగా బి.వెంకటేష్, బి.మహేశ్వర్, బి.కుమార్, యర్రప్పలను నియమించారు. అన్నమయ్యజిల్లా గౌరవాధ్యక్షులుగా బి.ఏ.రాజు, జయన్న, డివిజన్ ఉపాధ్యక్షులుగా వెంకటశివయ్య, సహాయకార్యదర్శిగా మోహన్, మదనపల్లె ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ,గౌరవాధ్యక్షుడిగా కె.సూర్యనారాయణ, సహాయ కార్యదర్శిగా పి.శ్రీనివాసులు, తంబళ్లపల్లె నియోజకవర్గ గౌరవాధ్యక్షుడిగా సీకే.శ్రీనివాసులు ఎంపికయ్యారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న డీవైఈఓ లోకేశ్వర్‌రెడ్డి

పీలేరురూరల్ : విద్యా రంగంలో నిరంతరం బోధనలో నిమగ్నమై ఉంటున్న ఉపాధ్యాయులకు క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని డీవైఈఓ లోకేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ప్రశాంత, శారీరక ధృడత్వం పెరుగుతుందని తెలిపారు. జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ మాట్లాడుతూ ఆగష్టు 10న యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా క్రీడాపోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, ట్రెజరర్ చంద్రశేఖర్, కార్యదర్శులు అక్రంబాషా, రమణమూర్తి, నాయకులు సుధాకర్, చంద్రశేఖర్, నరసరాజు, వెంకటరమణ, విజయకుమార్, రాజు, జోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

ఈనెల 6 నుంచి
బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ

కలికిరి(వాల్మీకిపురం): పీలేరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి ఈ నెల 6వ తేదీ నుంచి ×బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ× కార్యక్రమం నిర్వహించనున్నట్లు పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కార్యాలయం నుంచి ప్రకటనలో విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే చింతల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాలలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగించడంపై ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలతో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా గ్రామ స్థాయి కమిటీలు, మండల స్థాయిలో పార్టీతో పాటు అనుబంధ విభాగాల నియామక పత్రాలు అందజేయడంతో పాటు వారిని సత్కరించడం జరుగుతుందని ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాలకు ఆయా మండలాల పరిధిలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, నూతనంగా రాష్ట్ర, జిల్లా, మండలం, గ్రామ స్థాయి కమిటీలలో నియమింపబడ్డ నాయకులు తప్పనిసరిగా హాజరవ్వాలని కోరారు.

కూటమి పాలనలో సంక్షేమం తిరోగమనం



బి.కొత్తకోట: గుడుపల్లిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం

బి.కొత్తకోట: కూటమి ఏడాది పాలనలో సంక్షేమం తిరోగమనంలో ఉందని, చంద్రబాబు ఎప్పుడు సీఎం అయినా ఆయన పాలనలో మోసం గ్యారంటీ అని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గుడుపల్లె, బీరంగి గ్రామపంచాయతీల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాలను నిర్వహించారు. పల్లెపల్లెకు వెళ్లి గ్రామాల ప్రజలను కలిసి ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేయడంపై వివరించారు. ఇళ్లకు వద్దకు వెళ్లిన నాయకులు జగన్ పాలనలో ఆర్థిక లబ్ధి, కూటమి ఏడాది పాలనలో కలిగిన లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. జగన్ పాలనలో హామీల అమలుతో తమ కుటుంబాలు ఆర్థిక ప్రయోజనంతో ఇబ్బందుల నుంచి బయటపడ్డామని ఇప్పుడా పరిస్థితి లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచులు గిరిజ, వెంకటరమణ మాట్లాడుతూ ఐదేళ్ల జగన్ పాలనలో ప్రజలు సుఖశాంతులతో ఉన్నారని అన్నారు. ప్రతిఇంటికి సంక్షేమ లబ్ధి చేకూరితే కూటమి పాలనలో సంక్షేమం తిరోగమనంలో ఆందోళన వ్యక్తం చేశారు. జగన్ అందించిన సంక్షేమ కార్యక్రమాలతో ఆర్థిక వ్యవస్థ బలోపేతంగా ఉండేదన్నారు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగి ప్రభుత్వానికి పన్నుల రూపంలోఆదాయం వచ్చేదన్నారు. ప్రస్తుతం ప్రజల్లో కొనుగోలు శక్తి పడిపోయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కూలడం, జగన్ సీఎం కావడం ఖాయమన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సాంబశివ, జెడ్పీటీసీ రామచంద్ర, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు చింపిరి అమరనాధరెడ్డి, సర్పంచు రవికుమార్‌రెడ్డి, ఎంపీటీసీ యల్లప్ప, ఉపసర్పంచు వెంకటప్ప, కోఆప్షన్ సభ్యులు నాసిర్, రఘునాధరెడ్డి, ఆదిశేఖర్‌రెడ్డి, ఎం.శంకర్‌రెడ్డి, బాబురెడ్డి, బి.శంకర్‌రెడ్డి, నరసింహులు, గుమ్మిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవీరభద్రస్వామి విగ్రహప్రతిష్ట



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు పంచాయతీ చిన్నమాచిరెడ్డిగారిపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో రెండు రోజులుగా శ్రీవీరభద్రస్వామి విగ్రహ ప్రాణప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం వేదపండితులు శాస్త్రోక్తంగా వినాయకుని పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, యాగశాల పూజ, రెండవ కాల హోమం, గణపతి,లక్ష్మి, నవగ్రహ హోమం, రుద్రహోమం, పుణ్యాహుతి, మంగళ హారతితో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం వినాయకుని పూజ, పుణ్యాహవాచనం, యజమాన సంకల్పం, పంచగవ్యం,అష్టబంధనస్థాపనం నిర్వహించారు. సోమవారం ప్రాణప్రతిష్ట కార్యక్రమంలో మహాకుంభాభిషేకం నిర్వహిస్తారని కన్నెమడుగు దాయాదులు,గ్రామ ప్రజలు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. మూడు రోజుల పాటు అన్నసంతర్పరణ నిర్వహిస్తున్నారు.

సాంకేతిక ధోరణులను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ప్రముఖ క్లౌడ్ ఇంజనీర్ విష్ణువర్ధన్‌రెడ్డి

మదనపల్లె సిటీ: విద్యా సంస్థలు సాంకేతిక ధోరణులను పెంపొందించుకోవాలని ప్రముఖ క్లౌడ్ ఇంజనీర్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో వీఎం వేర్, విండ్ రివర్‌తో 5జీ నెట్‌వర్కింగ్‌పై వెబినార్ నిర్వహించారు. 5జీ.కేబుల్, క్లౌడ్ స్థానిక నెట్‌వర్క్‌లను నిర్మించడంలో వీఎం వేర్, విండ్ వేర్ కీలకపాత్ర పోషిస్తాయన్నారు. వేగవంతమైన సాంకేతిక మార్పుకు అనుగుణంగా మారడంపై ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాయుడు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో జీకే నేచర్ వ్యాలీ



జీకే.నేచర్ వ్యాలీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, వెంచర్ యజమానులు గోపాల్‌రెడ్డి, టీకేఎన్

మదనపల్లె రూరల్ : ప్రకృతి ఒడిలో, పచ్చని చెట్ల మధ్య, ఆహ్లాదకర వాతావరణంలో అందరినీ ఆకట్టుకునేలా అద్భుతంగా తీర్చిదిద్దిన జీకే నేచర్ వ్యాలీ ప్రజల మన్ననలు పొందాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారికిషోర్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్ రెడ్డి అన్నారు. అనంతపురం-కృష్ణగిరి జాతీయరహదారిపై ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఏర్పాటుచేసిన జీకే.నేచర్ వ్యాలీ ప్రారంభోత్సవం ఆదివారం ఉదయం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, ప్రముఖులు హాజరయ్యారు. నేచర్ వ్యాలీ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో యజమానులు గోపాల్‌రెడ్డి, టి.కృష్ణప్పనాయుడు(టీకేఎన్), మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, జనసేన గంగారపు రామ్‌దాస్‌చౌదరి, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, కురవంక సర్పంచ్ పసుపులేటిచలపతి, రిటైర్డ్ డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, వరపన కిరణ్‌రెడ్డి, కువైట్ మాధవరెడ్డి, కసుగొండ, రాజేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయాం

– వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ప్రజా సంక్షేమం



కూటమి ప్రభుత్వం మోసాలపై వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

ములకలచెరువు: చంద్రబాబు మోసపూరిత మాలు నమ్మి మోసపోయామని మండల ప్రజలు అన్నారు. ప్రజలను సూపర్ సిక్స్ పేరుతో మరోసారి ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు మోసం చేశాడని... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం అమలు జరిగిందని ప్రజలు అన్నారు. ఆదివారం మండలంలోని చౌడసముద్రం, సోంపల్లి, గూడుపల్లె పంచాయతీలో బాబు షూరిటీ – మోసం గ్యారింటీ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు సర్కార్ ప్రజలకు చేసిన మోసంపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించి క్యూఆర్ కోడ్‌లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ప్రజలకు నమ్మబలికి అధికారంలోకి వచ్చాక పథకాలపై ఊసే లేదని పలువురు మహిళలు చెప్పకొచ్చారు. ప్రతి ఒక్కరికీ ఇళ్లు కట్టిస్తానని చెప్పి ఇంతవరకు దానిపై చర్చించలేదని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదు, కరెంట్ చార్జీలు పెంచడంపై ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం ఇంటి వద్దకే వచ్చేవని, ఇప్పుడు రేషన్ షాపుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో ఒక్క పథకం మాకు అందలేదని వాపోయారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన హామీల కంటే ఎక్కువే చేశారని ఆయన అందించిన సేవలను ప్రజలు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయిలీలా, సర్పంచులు విష్ణువర్ధన్‌రెడ్డి, రెడ్డెప్ప, రాంబాబునాయుడు, ఎంపీటీసీలు మహేశ్వరీ, క్రిష్ణప్ప, నాయకులు జయరాంరెడ్డి, రెడ్డెం క్రిష్ణారెడ్డి, గోరా రవీంద్రారెడ్డి, కుల్‌దీప్‌రెడ్డి, ఉదయ్, డాక్టర్ విశ్వనాథ్, చాంద్‌బాషా, తదితరులు ఉన్నారు.

ప్రజల పక్షాన పోరాడితే నిర్భంధమా



సభలో మాట్లాడుతున్న నరసింహులు

బి.కొత్తకోట: ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన పోరాడితే నిర్బంధిస్తారా అని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం బి.కొత్తకోట సీపీఐ నియోజకవర్గ ఆరవ మహాసభను నిర్వహించారు. షాదీమహల్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థల కొమ్ముకాస్తున్నాయని అన్నారు. పెట్టుబడిదారుల కోసం పేదల భూములను కొల్లగొట్టి ధారాదత్తం చేస్తున్నారన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించడంలో, కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఉద్యమాలను చేపడుతున్నామన్నారు. కాగా సభ నిర్వహణకు ముందుకు జ్యోతిచౌక్‌లో సీపీఐ జెండాను ఏగురవేశారు. అక్కడినుంచి కార్మికులు, పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, మురళి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్, హరికుమార్, కే.అంజనప్ప, బషీర్‌ఖాన్, రఘునాథ్, సలీంబాషా, అష్రఫ్ లీ, తంబయ్యశెట్టి, వేణుగోపాల్, నిజాముద్దీన్, అమరావతి, నారాయణస్వామి, షమీవుల్లా, చౌడప్ప, మల్లికార్జున, హబీబ్, రియాజ్ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ, శిఖర కలశ ప్రతిష్ట



కలశాలను తీసుకువస్తున్న భక్తులు

నిమ్మనపల్లె : మండలంలోని తవళం నేలమల్లేశ్వర స్వామి వారి ఆలయ పునః ప్రతిష్ట కార్యక్రమంలో ఆదివారం వేదమంత్రోచ్ఛారణల మధ్య అర్చక బృందం, ఆలయ ఈఓ మంజుల ఆధ్వర్యంలో ధ్వజస్తంభం, శిఖర కలశ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. ఉదయం దీక్షా హోమము, మూలమంత్ర హోమములు , మహాస్నపనము, శిఖరన్యాస తత్వ హోమము, శిఖర కలశ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట విగ్రహ దాన్యాధివాసము, సాయంత్రం శ్రీ గణపతి, రుద్ర, దుర్గా ,లక్ష్మి ,సరస్వతి హోమములు శయ్యాదివాస హోమము, వేద స్వస్తి ,మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు.స్వామివారిని విశ్రాంత హైకోర్టు జడ్జి, పీఎస్. నారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. గుత్తా హరికృష్ణ కుటుంబ సభ్యులతో కలసి అన్న దాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పెద్దిరెడ్డి కుటుంబంపై చంద్రబాబుకు కక్ష



పీలేరు: ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కేవీపల్లె: నల్లగంగమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు



ములకలచెరువు: ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కూటమి ప్రభుత్వ తీరుపై వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆగ్రహం

పీలేరు : మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి కుటుంబంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కక్ష పెట్టుకొని ఆ కుట్రలో భాగంగా ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ చేసి జైల్లో ఉంచారని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మిథున్‌రెడ్డి జైలు నుంచి విడుదల కావాలని కోరుతూ ఆదివారం మండలంలోని యర్రగుంట్లపల్లె పంచాయతీలో శ్రీ పసన్న ఆంజనేయస్వామి ఆలయంలో 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లేని లిక్కర్ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ అమరనాథరెడ్డి, మాజీ ఎంపీటీసీ భానుప్రకాష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాలం నరేంద్రరెడ్డి, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, వినోద్ గౌడ్, మల్లి, రమణ, రాజారెడ్డి, రాజశేఖర్, రంజిత్, సురేంద్రరెడ్డి, లవకుమార్, సుధాకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని పూజలు

కేవీపల్లె : అక్రమ మద్యం కేసులో అరెస్ట్ కాబడి జైల్లో ఉన్న ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి విడుదల కావాలని కోరుతూ మండలంలోని తిమ్మాపురం నల్లగంగమ్మ ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఆలయంలో కొబ్బరి కాయలు కొట్టి ఎంపీ త్వరితగతి జైలు నుంచి విడుదల కావాలని ఆకాంక్షించారు. ఎంపీ మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం కక్ష కట్టి అక్రమ కేసుతో జైల్లో పెట్టడం అన్యాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామ్మోహన, నాగేశ్వర, భాస్కర్, ఈశ్వరయ్య, మురళి, చంద్రబాబు, సాయి, ఇక్బాల్, పవన్, మణి, మస్తాన్, రమేష్, వెంకటరమణ, ప్రతాప్, రామయ్య, మల్లికార్జున, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కోసం పూజలు

ములకలచెరువు: అక్రమ లిక్కర్ కేసులో అరెస్టు అయిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జైలు నుంచి క్షేమంగా విడుదల కావాలని కోరుతూ ఆదివారం చౌడసముద్రంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సదర్భంగా 101 కొబ్బరి కాయలు కొట్టి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం రాజకీయ కుట్రలో బాగంగా సంబందంలేని కేసులో మిథున్ రెడ్డిని అరెస్టు చేశారని ఆరోపించారు. మిథున్‌రెడ్డి ఆరోగ్యం బాగా ఉండాలని భగవంతున్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాయిలీలా, సర్పంచు రాంబాబు, ఎంపీటీసీ మహేశ్వరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.